## కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు



వేడుకల్లో పాల్గొన్న నిర్మాత సూర్యదేవర నాగవంశీ

**నిజాంపేట్:** బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజేఐఈటీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే కల్చరల్ ఫెస్ట్ సిన్జిలేషన్స్ 2కె24 గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చలన చిత్ర నిర్మాణ సూర్యదేవర నాగవంశీ, నటుడు శివాజీరాజా ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో రాణించాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు మాట్లాడారు. విద్యార్థులకు మూడు రోజుల వేడుక ఆట విడుపుల లాంటిదన్నారు. బాధ్యతగా ప్రవర్తిస్తూ ఆట పాటలతో ఉత్సాహంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పురోగాభివృద్ధి డీన్ డాక్టర్ పద్మశాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**నిజాంపేట్:** ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో ముస్లిం, హిందూ శ్మశానవాటికల్లో నీటి బోర్ల పనులకు కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశాన వాటికల్లో నీళ్లు లేక దహన సంస్కారాలకు వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారని.. బోర్లు అందుబాటులోకి వస్తే సమస్య తీరనుందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ స్పెషల్ ఫండ్‌తో రాజీవ్‌గాంధీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

## పార్కు స్థలం చదును విషయంలో వివాదం

### జేసీబీని అడ్డుకున్న స్థానికులు

**దుండిగల్:** పార్క్ స్థలాన్ని చదును చేయడంతో పాటు జేసీబీతో సామగ్రిని తొలగించడం వివాదస్పదంగా మారింది. స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో శ్రీలక్ష్మీశ్రీనివాస కన్స్‌స్ట్రక్షన్స్ పేరుతో గతంలో విల్లాలు నిర్మించారు. అందులో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ స్థలాలను ఆక్రమించి సుమారు 7 విల్లాలు చేపట్టారని గుర్తించి అధికారులు కూల్చివేయడం అప్పట్లో సంచలనంగా మారింది.

◆ అయితే విల్లాల్లో కొంత స్థలంలో స్థానిక ప్రజలు పార్క్ స్థలానికి కేటాయించి ఆట సామగ్రి ఏర్పాటు చేశారు. గురువారం కొందరు వ్యక్తులు వచ్చి పార్క్ స్థలం తమకు చెందిందన్నారు. కోర్టు ఆర్డర్ సైతం ఉందని చెప్తు జేసీబీతో పార్క్ స్థలాన్ని చదును చేస్తు సామగ్రిని తొలగించారు. దీంతో స్థానికులు పార్క్ స్థలం తమకు వస్తుందన్నారు. విల్లాలు కొనుగోలు చేసే సమయంలో పార్క్ స్థలాన్ని చూపించారని పలు విల్లాల యజమానాలు పేర్కొంటున్నారు. ఉమ్మడి సర్వే ఆధారంగా స్థలం ఎవరిదని తేలుతుందో వారే ఆ స్థలాన్ని వినియోగించుకోవాలని పలువురు సూచించారు.

## మాల, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కుత్బుల్లాపూర్:** మాల, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గురువారం ఎస్సీ ఉప కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారుడు నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాల, మాదిగ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం అభినందీయమని అన్నారు. అయితే 57 ఎస్సీ ఉపకులాలకు దీంతో తీవ్ర అన్యాయం జరిగే అవకాశముందన్నారు. మాల, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన ప్రభుత్వ సలహాదారుడిని కోరారు. జనాభా దామాషా పద్ధతిలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బాణాల మంగేష్, ఎర్పుల యాదయ్య, సదుల తిరుమల హరి, కడమంచి ఎల్లేష్, కార్ని ముత్యాలు, కప్పరి రమేష్, సాదుల, నునె రాజు, నూనె లాలయ్య, సదుల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**దుండిగల్:** అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డు వద్ద అంజియాదవ్ అనే వ్యక్తి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి తన దుకాణం ముందు అచేతనంగా పడి ఉండటాన్ని గమనించాడు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి పరిశీలించి చనిపోయినట్లుగా నిర్ధారించారు. విషయాన్ని పోలీసులకు తెలపగా సంఘటన స్థలానికి వచ్చి శవ పంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని అన్నారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హోర్డింగ్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

**దుండిగల్:** మతిస్థిమితం లేని ఓ వ్యక్తి హోర్డింగ్ ఎక్కి హల్‌చల్ చేశాడు. గంట పాటు పోలీసులను ముప్పతిప్పలు పెట్టాడు. చివరికి క్రేన్ సహాయంతో అతడిని కిందికి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన గురువారం దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం జ్యోతి మిల్క్ డైరీ వద్ద ఉన్న ఓ హోర్డింగ్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఎక్కాడు. ఇది గమనించిన స్థానికులు 100కు డయల్ చేయడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. కిందకు దిగమని సదరు వ్యక్తిని ఎంత వేడుకున్నా కనీసం పట్టించుకోలేదు. సమారు గంట పాటు ఇదే తంతూ కొనసాగింది. చివరకు కానిస్టేబుళ్లు లక్ష్మణ్, కరీంలు ఓ క్రేన్ సహాయంలో అతన్ని సురక్షితంగా కిందికి దించడంతో కథ సుఖాంతమైంది. సదరు వ్యక్తికి మతిస్థిమితం లేదన్నారు. అర్ధనగ్నంగా ఉన్నాడని.. అతని వివరాల కోసం వాకబు చేయగా కనీసం మాట్లాడటం లేదని పోలీసులు తెలిపారు. అనంతరం అతడికి టిఫిన్ తినిపించి అక్కడి నుంచి పంపించి వేశారు.



క్రేన్ సాయంతో కిందకు దించుతున్న పోలీసులు



మతిస్థిమితం లేని వ్యక్తి

# షాడో బిల్‌కలెక్టర్ల హల్‌చల్!

- ఒక్కో అధికారికి ఇద్దరు చొప్పున ప్రైవేట్ సైన్యం
- వారితోనే పన్నులు వసూలు చేయిస్తున్న వైనం

**కుత్బుల్లాపూర్:** ఆస్తి పన్ను వసూళ్ల విషయంలో షాడో బిల్ కలెక్టర్లు హల్‌చల్ చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఒక్కో బిల్ కలెక్టర్‌కు ఇద్దరు చొప్పున షాడో బిల్ కలెక్టర్లు ప్రైవేట్ సైన్యాన్ని పెంచి పోషిస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

◆ గతంలో ఉన్న గ్రేటర్ కమిషనర్లు పలు సందర్భాల్లో షాడో బిల్ కలెక్టర్ల విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఒకవైపు 2024 సంబంధించి మార్చి 31వ తేదీ వరకు రెవెన్యూ బస్సులు టార్గెట్ పూర్తి చేసే దిశగా బిల్ కలెక్టర్లకు స్థానిక ఉపకమిషనర్లు ఆదేశాలు జారీ చేయగా జంట సర్కిళ్ల కార్యాలయాల వద్ద బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు నిలబడి కబుర్లు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తూ షాడో బిల్ కలెక్టర్లతో అన్ని పనులు చక్కదిద్దుతున్నారు.

◆ ప్రతిరోజు ఉదయం కార్యాలయానికి రావడం తాము నియమించుకున్న ప్రైవేటు సైన్యానికి ఆదేశాలు జారీ చేయడం కబుర్లు చెప్పుకొని ఇంటికి వెళ్లడం ఇక్కడ పరిపాటిగా మారింది. సంబంధిత అధికారులపై ఎటువంటి నిఘా లేకపోవడం మూలంగా వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

**మరో 17 రోజుల్లో టార్గెట్ పూర్తి చేస్తారా.?**

◆ కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇప్పటికే 2024 మార్చి 31కి సంబంధించిన టార్గెట్ విషయంలో షాడో బిల్ కలెక్టర్లు హవా కొనసాగుతోంది. ఇక్కడ పనిచేసే బిల్ కలెక్టర్లకు ఒక్కరికి ఇద్దరు చొప్పున ప్రైవేట్ సైన్యాన్ని నియమించుకొని వారితో అన్ని పనులు చేయిస్తూ వీరు మాత్రం కాలర్ ఎగరేస్తూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో పలు అక్రమాలకు తెరలేపుతూ జేబులు నింపుకుంటున్నారనేది ప్రధాన ఆరోపణ. మరో 17 రోజుల్లో మొత్తం 27 కోట్ల రూపాయలు ఈ రెండు సర్కిళ్ల పరిధిలో వసులు కావాల్సి ఉండగా బిల్ కలెక్టర్లు, రెవున్యూ ఇన్‌స్పెక్టర్లు వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

◆ బిల్ కలెక్టర్‌గా ఇక్కడే గత 20 సంవత్సరాలుగా (రెండు మూడు సంవత్సరాలు ఇతర సర్కిల్ లకు బదిలీపై వెళ్లి వచ్చి) పనిచేస్తూ వస్తున్న ఓ అధికారి మరికొద్ది రోజుల్లో పదవి విరమణ చేస్తూ ఉన్న విషయాన్ని గుర్తు పెట్టుకొని ప్రతిరోజు టార్గెట్ వారిగా పెద్ద మొత్తంలో కొత్త ఇంటి నెంబర్లు కేటాయిస్తూ లక్షల్లో దండుకుంటున్నారన్న ప్రధాన విమర్శ ఉంది. సదరు అధికారి చేస్తున్న అసెస్‌మెంట్ల విషయంపై పూర్తిస్థాయి విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే అటు జీహెచ్‌ఎంసీకి ఆదాయ వనరులు రావడమే కాకుండా సదరు అధికారి వ్యవహరిస్తున్న తీరు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా తన కిందిస్థాయి బిల్‌కలెక్టర్ల వద్ద నుంచి కూడా భారీ మొత్తంలో రోజువారీగా టార్గెట్ విధించి వసూళ్లకు పాల్పడుతున్నారనేది ప్రధాన ఆరోపణ.





కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయం

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ లో 2023 –24 ఆర్థిక సంవత్సరంలో 57.38 కోట్ల రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.40.24 కోట్ల రెవెన్యూ వసూలయ్యింది. మరో రూ.17కోట్లు ఈ నెలాఖరు వరకు వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గాజులరామారం సర్కిల్ పరిధిలో మొత్తం రూ.34.97 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.24.96 కోట్లు వసూలు కాగా మరో రూ.10కోట్లు రావాల్సి ఉంది.

**ప్రతి సంవత్సరం పండగే..**

◆ కుత్బుల్లాపూర్ 61,863, గాజులరామారం 49, 332 జంట సర్కిల్ పరిధిలో ఉన్న వ్యాపార, వాణిజ్య, గృహాల సముదాయాల నుండి రెవెన్యూ వసూలు చేస్తూ ఉండగా కొన్ని నిర్మాణాలు ఇప్పుడు కమర్షియల్‌గా మారగా వాటిని వెలుగులోకి రాకుండా ఆయా ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు ప్రతి సంవత్సరం వారి వద్ద నుంచి అధిక మొత్తంలో లంచాలు తీసుకొని గోప్యంగా ఉంచుతున్నారు. పాత ట్యాక్స్ డబ్బులనే తీసుకుంటూ కొత్తగా అసెస్మెంట్ వేయకుండా సెటిల్మెంట్లు చేసుకుంటూ వస్తున్నారు. అందులో షాడో బిల్ కలెక్టర్ల పాత్ర అధికంగా ఉంటుంది.

◆ చింతల్ ద్వారకపురి కాలనీలో ఓ నిర్మాణదారుడు గతంలో ఇంటి పర్మిషన్ తీసుకోగా తాజాగా హాస్టల్‌కు అద్దెకు ఇచ్చాడు. గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతూ రాగా ఇప్పటివరకు ఇంటి నిర్మాణం పేరుతోనే టాక్స్ చెల్లిస్తూ వస్తున్నాడు. ప్రతి సంవత్సరం ఈ నిర్మాణానికి వేయాల్సిన అదనపు టాక్స్ మినహాయింపు ఇస్తూ బిల్ కలెక్టర్ సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తూ రావడం విశేషం. ఇతనికి పై అధికారిగా ఉన్న వ్యక్తి పదవి విరమణ చేస్తున్నాడని అధిక మొత్తంలో వసూళ్లు చేస్తూ లక్షల సొమ్ము వెనకేసుకుంటూ గ్రేటర్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

## కాంగ్రెస్ మహిళా సేవాదళ్ సెక్రటరీగా అంజలియాదవ్

**కుత్బుల్లాపూర్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా సేవాదళ్ సెక్రటరీగా గాజులరామారం డివిజన్ కైలాష్‌షిల్స్‌కు చెందిన గంగుల అంజలి యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అంజలి యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ప్రభావితం చేసి ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను తెలియజేసి పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంజలియాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

## రేపు ఫ్రీ హియరింగ్ స్క్రీనింగ్ క్యాంప్

**నిజాంపేట్:** ప్రైమ్ రిహాబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాలులో ఈనెల 16న పిల్లలు, పెద్దలకు ఫ్రీ హియరింగ్ స్క్రీనింగ్ క్యాంప్, చైల్డ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే శిబిరంలో వినికిడి తగ్గిన వారు, మందకోడిగా ఉండే పిల్లలకు పరీక్షలు నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు సూచనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9121295999లో సంప్రదించాలని కోరారు.

## మర్యాదపూర్వక కలయిక

**చింతల్:** చింతల్ డివిజన్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా పనిచేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. హరివర్ధన్ రెడ్డిని కలిసిన వారిలో చింతల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకుడు బాల్‌రెడ్డి, రోహిత్, పాండు, అభిషేక్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

**కుత్బుల్లాపూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని మేడ్చల్ జిల్లా సంఘం అధ్యక్షుడు బూర్గభావి హన్మంతరావు అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన సంఘం నాయకులు కొండా దేవయ్య, ఎడ్ల రవి, కొత్త లక్ష్మణ్, ఉగ్గే శ్రీనివాస్, బండి సంజీవ లు చేసిన కృషి మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శి సాయిని శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్ల అధ్యక్షులు బొచర్ల లక్ష్మీనారాయణ, నరేంద్ర కుమార్, నాయకులు పత్తి రాములు, వేషాల సంపత్, సుధాకర్, గాదే నరసింహులు, ముకుంద రావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడు హన్మంతరావును సత్కరిస్తున్న యువజన అధ్యక్షుడు భాస్కర్

## రక్తదాన శిబిరం ప్రారంభించాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రేస్ కాస్పల్ చర్చి పాస్టర్లు

**కుత్బుల్లాపూర్:** రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి జీవితాన్ని అందించిన వారవుతారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల గ్రేస్ కాస్పల్ చర్చి పాస్టర్ శౌరి బోల్లేదు ఆధ్వర్యంలో గురువారం కుత్బుల్లాపూర్‌కు చెందిన పలువురు పాస్టర్లు ఎమ్మెల్యే వివేకానంద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 16న ఉదయం 9 గంటలకు గ్రేస్ గాస్పల్ చర్చ్ ఆవరణలో నిర్వహించే రక్తదాన శిబిరానికి హాజరై ప్రారంభించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలసీమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం నిర్వహిస్తున్న శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. పాస్టర్లు జాషువా, స్మిత్ బాబు, ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

## 150 గంజాయి చాక్లెట్ల పట్టివేత



**జీడిమెట్ల:** ఓ కిరాణా దుఖాణంలో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహర్ రాష్ట్రానికి చెందిన శిబుకుమార్(19) ఉపాధి కోసం నగరానికి వచ్చి రాంరెడ్డినగర్‌లో నివాసం ఉంటూ ఓ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్లుఓ వ్యక్తి ఇచ్చిన సమాచాం మేరకు బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. దీంతో అతని దుకాణంలో 150 గంజాయి చాక్లెట్లు లభ్యం అయ్యాయి. మొత్తం 600 గ్రాముల చాక్లెట్లతో పాటు స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.11500 మేరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

## వీడలేమంటూ.. వీడ్కోలంటూ.!





కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఫేర్‌వెల్ కార్యక్రమంలో విద్యార్థులతో కేఎం ప్రతాప్, ఉపాధ్యాయులు

**రంగారెడ్డినగర్:** విద్యార్థులు క్రమశిక్షణ, కృషి పట్టుదలతో ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనువజ్ఞులైన అధ్యాపకుల సేవలను ఉపయోగించుకుని అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునే దిశగా పట్టుదలతో చదవాలన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**దుండిగల్:** అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి మాధవరం కాలనీకి చెందిన అగంటి శ్యామ్‌కుమార్(45) కపిల్ చిట్‌ఫండ్స్‌లో జాబ్ కలెక్షన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. కాగా శ్యామ్‌కుమార్ పలువురి వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో తిరిగి చెల్లించాలని పలువురు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న తల్లి, సోదరుడు వద్దకు వచ్చాడు. వారిద్దరు తమ విధులకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరిగి ఇంటికి వచ్చిన తల్లి, సోదరుడు తలుపులు కొట్టినా తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# సీఓ పాపాగౌడ్‌పై విచారణ చేపట్టాలి

- మహిళా సంఘాల సభ్యులతో దురుసు ప్రవర్తన • అసభ్యంగా మాట్లాడుతున్నారని డీసీకి ఫిర్యాదు

**చింతల్:** పొదుపు సంఘాల మహిళల పట్ల లంచాలు అడుగుతూ.. అసభ్యంగా మాట్లాడుతున్న చింతల్ డివిజన్ కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీఓ) పాపాగౌడ్‌పై విచారణ చేపట్టాలని చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మహిళా సంఘాల సభ్యులు గురువారం గాజులరామారం డిప్యూటీ కమిషనర్‌కు కలిసి ఫిర్యాదు చేశారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగత్‌సింగ్‌నగర్‌లో గత 20 నుంచి 25 ఏళ్ల నుంచి సుమారుగా 70 పొదుపు సంఘాలతో ఆరు సమాఖ్యలుగా ఏర్పడి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సీఓగా పనిచేస్తున్న పాపాగౌడ్ అనే వ్యక్తి వార్డు కార్యాలయాలకు వచ్చే మహిళల పట్ల దురుసు ప్రవర్తనతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. మహిళలకు ఇంటి దగ్గర పనిలేక వార్డు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

**రుణాల ప్రాసెస్‌కు లంచం ఇవ్వాల్సిందే...**

◆ పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణాల ప్రాసెస్ కోసం.. లోన్ ప్రాసెస్ పూర్తయిన తర్వాత సంఘంలోని ఒక్కో సభ్యుడి నుంచి రూ.10 నుంచి 20వేల వరకు లంచం డిమాండ్ చేసి అందినకాడికి వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు, వాటి స్టేటస్ తెలుసుకునేందుకు వచ్చే మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్లు మంజూరైన లబ్ధిదారుల నుంచి పెన్షన్‌కార్డులు ఇంటింటికీ అందజేయడానికి కూడా భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు.



పాపాగౌడ్‌పై ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

**పద్ధతి మార్చుకోవాలని చెప్పినా అదే తీరు..**

◆ పాపాగౌడ్‌కు పద్ధతి మార్చుకోవాలని ఎన్నిసార్లు మందలించినా అతడి ప్రవర్తనలో మార్పు లేదు సరికదా.. "నేను ఇలానే ఉంటాను మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు అంటూ... ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. నన్ను ఎవరు ఏం చేయలేరంటూ" మహిళలకు వార్నింగ్ ఇస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా పాపాగౌడ్ విధులు నిర్వర్తిస్తున్నాడని పేర్కొన్నారు.

**రూ.2500 ఇస్తే గృహజ్యోతికి అర్హులను చేస్తా...**

◆ ఇందిరమ్మ ఇళ్లకు రూ.10వేలు ఇస్తే శాంక్షన్ చేయిస్తానని, రూ.2500 ఇస్తే గృహలక్ష్మి పథకం శాంక్షన్ చేయిస్తానని ఇదంతా తన చేతిలో పని అంటూ అమాయకులను మోసం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రగతి మహిళ స్లమ్ సమాఖ్య, ప్రతిభ స్లమ్ సమాఖ్య, విజేత స్లమ్ సమాఖ్య, స్ఫూర్తి మహిళ స్లమ్ సమాఖ్య, కీర్తి మహిళ స్లం సమాఖ్య, సమత స్లమ్ సమాఖ్య సంఘాల మహిళల ప్రతినిధులు సభ్యులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## అడ్డుఅదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు

- అనుమతి లేకుండా చాయ్ దుకాణం ఏర్పాటు
- మాజీ ఎంపీటీసీకి చెందినది కావడంతో పట్టించుకోని అధికారులు

**కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్ ముందు భాగంలో చాయ్ దుకాణం పేరిట భారీ నిర్మాణం చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ ఈ నిర్మాణానికి అనుమతి లేకపోయినా ఫంక్షన్‌హాల్ పేరుతో ఉన్న ఈ ఖాళీ స్థలంలో ఇటీవల చాయ్ దుకాణం పేరిట షెడ్డు ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డుకు ఆనుకొని సుమారు 400 గజాల విస్తీర్ణంలో చుట్టూ టేబుల్ వేసి పార్కింగ్‌ను రోడ్డు మీదనే ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణానికి అనుమతి లేకపోవడంతో ఇప్పటికే పలువురు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేయగా నోటీసులు సిద్ధం చేశారు.

◆ ఇదే విషయంపై కమిషనర్ స్పందిస్తూ నోటీసు జారీ చేసి కూల్చివేతలు చేపడతామని తెలిపారు. సదరు అక్రమ నిర్మాణం మాజీ ఎంపీటీసీకి చెందినది కావడంతో నిర్మాణ సమయంలో అధికారులు చోద్యం చూశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





కొంపల్లిలో ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌ను ఆనుకుని రోడ్డుపై ఏర్పాటు చేసిన చాయ్ దుకాణం